మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేత



**వర్గల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున క్షేత్ర ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరుగనుండగా బుధవారం రాష్ట్ర మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వర్గల్ గొల్లకురుమలు మాజీ జెడ్పీటీసి బాలమల్లు యాదవ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం ఉంటుందని, ప్రతిష్ఠ మహోత్సవానికి తప్పకుండా హాజరవుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, పుల్లయ్య, శ్రీశైలం, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థిని ప్రతిభ

**జగదేవపూర్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించగా చాట్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మానూరి ప్రియాంక తృతీయ స్థానంలో నిలిచింది. బుధవారం విద్యార్థినికి ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి మెమొంటోను అందజేసి అభినందించారు. గ్రామానికి చెందిన విద్యార్థిని తృతీయ స్థానం దక్కడంతో విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థినికి మెమొంటో అందజేస్తున్న మాధవరెడ్డి



ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

## నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలలో 144 సెక్షన్

### గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతారెడ్డి అరెస్టు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ప్యారా నగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్‌పై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు నిరసనలు చేపట్టడంతో పరిస్థితి అదుపులో ఉంచేందుకు నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలలో 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులను పరామర్శించేందుకు వెళ్లిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అరెస్టుచేసి భానూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్యారా నగర్‌లో ఏర్పాటుచేస్తున్న డంపింగ్ యార్డు ద్వారా శివ్వంపేట మండలం లోఉన్న కొన్ని గ్రామాలలో పూర్తిగా వాతావరణం, నీటి, వాయు కాలుష్యం అయ్యే అవకాశం ఉందని అన్నారు. వివిధ గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డు వద్దు అంటే పోలీసులు పహారాలో బలవంతంగా ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగింది. దీంతో ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషనులకు తరలించారు.

## ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : ఆర్డీవో



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో రమాదేవి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యర్థుల ఎన్నికల ప్రచార సభలకు, సమావేశాలు, ర్యాలీలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అన్ని పార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ తీరుపై చర్చించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మన్నన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీప్తి, అధికారులు పాల్గొన్నారు.

## సిద్దేశ్వర ఆలయ భూములను కాపాడండి

### ఆలయ కమిటీ సభ్యులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్



మాట్లాడుతున్న సిద్దేశ్వర ఆలయ కమిటీ సభ్యులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని పురాతనమైన శ్రీసిద్దేశ్వర ఆలయ భూములు, ఆస్తులు కబ్జాకు గురికాకుండా దేవాదాయశాఖ తగు చర్యలు తీసుకోవాలని సిద్దేశ్వర ఆలయ కమిటీ సభ్యులు కొత్తకాపు సురేందర్‌రెడ్డి, డి.శ్రీనివాస్ విజ్ఞప్తిచేశారు. బుధవారం ఆలయ ఆవరణలో వారు మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన భూములను, ఆస్తులను వ్యాపారవేత్త వి.ప్రభాకర్‌గౌడ్ కబ్జా చేసుకునేందుకు కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. దేవాలయ ఫౌండర్ అంటూ ప్రభాకర్‌గౌడ్ దొంగ సర్టిఫికెట్లను సంపాదించుకుని దేవాలయ భూములను కాజేసేందుకు యత్నిస్తున్నాడని మండిపడ్డారు. దేవాదాయ శాఖ అధికారులు 1985లో చెన్నయ్యస్వామిని, 1998లో బోయిన నర్సింహులును ఆలయ కమిటీ చైర్మన్లుగా నియమించారని గుర్తు చేశారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభాకర్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, మాజీ చైర్మన్ బోయిని నర్సింలు, పి రామన్న, పి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోని బడ్జెట్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అసంఘటితరంగ కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. మోడీ సర్కారు పెద్దల కొమ్ము కాస్తుంది తప్ప పేదలకు,కార్మికలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కోట్ల మంది కార్మిక వర్గానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరాశే మిగిలిందన్నారు. కార్మికులను ఆదుకోవడానికి బడ్జెట్‌లో నిధులు కేయించకపోవడం సరికాదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తీసుకరావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాలుగు కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్ల మల్లేశం, కర్ణాల చంద్రం, తయుసుపల్లి బిక్షపతి, బెక్కంటి సంపత్, గోవిందారం నర్సింహులు, చింతమడక రాజు, శ్రీనుచారి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

# మధ్యాహ్న భోజనాన్ని పగడ్బందీగా అమలు చేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ రూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**

మధ్యాహ్న భోజనాన్ని పగడ్బందీగా అమలు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మెదక్ మండలం పాతూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆర్డీవో రమాదేవితో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న ఆహారం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, డైనింగ్‌హాల్, క్లాస్ రూమ్‌లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను స్వయంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీని, వడ్డించడానికి సిద్ధంగా ఉన్న అన్నాన్ని పరిశీలించారు. వంటకు పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోజనం వండటానికి ముందే ప్రతి రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యత లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చదువు కొనసాగించేలా అనుకూల పరిస్థితులు కల్పించాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

### కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి స్థల పరిశీలన

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**

కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టడానికి అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ పట్టణం, పాతూరుగ్రామంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుతో కలిసి కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పాతూరులో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టేందుకు భూమిని గుర్తించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, సంబంధిత నివేదికలు తయారుచేసి వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాహశీల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం నిమగ్నం

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :**

స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాటులో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుంది. సంగారెడ్డి జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. గత విడతలో జరిగిన ఎన్నికలకు సంబంధించి జడ్పీటీసీలు ఎంపీటీసీల వివరాలు, జనాభా, పోలింగ్ స్టేషన్లో రూట్ మ్యాప్‌లు, రూట్ ఆఫీసర్ రిటర్నింగ్ ఆఫీసర్, ఎన్నికల సిబ్బంది తదితర వివరాలు సేకరిస్తున్నారు. గతంలో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి 25 జెడ్పిటిసి స్థానాలు ఉండగా, మండలాలు పెరగడంతో రెండు జెడ్పిస్థానాలు పెరిగాయి మొత్తం 27 జెడ్పిటిసిలు, 633 గ్రామపంచాయతీల పరిధిలో, 276 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2011 జనాభా ప్రకారం సంగారెడ్డి జిల్లాలో 9,41,742 మంది జనాభా ఉంది. గత విడతలో జరిగిన జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 1648 పోలింగ్‌స్టేషన్‌లు ఏర్పాటుచేశారు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ సంఖ్య మారనుంది. జిల్లాలో అత్యధిక ఎంపీటీసీలు (16) కలిగిన మండలం హత్నూర కాగా, అత్యల్ప ఎంపీటీసీలు (5) కలిగిన మండలాలుగా గుమ్మడిదల అమీన్‌పూర్ జిన్నారం ఉన్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ జారీచేసినా జిల్లాలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన రూట్ మ్యాప్‌లు, రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం అవసరమైన సిబ్బంది తదితర విషయాలపై సమాచార సేకరణలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల ప్రకారం వివరాలు సేకరణ, నివేదికలు అందజేస్తున్నామని సంగారెడ్డి జడ్పి సీఈఓ జానకిరెడ్డి తెలిపారు.





సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయం

## మాజీ సర్పంచ్‌ల బిల్లులు వెంటనే చెల్లించాలి

### బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** గడిచిన ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేసిన సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ డిమాండ్ చేశారు.బుదవారం రోజున ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులె చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు శాంతియుతంగా చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పెట్టుకుంటే వారిని ముందస్తు అరెస్టులు చేసి అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు.గ్రామల అభివృద్ధి కోసం మాజీ సర్పంచ్‌లు అప్పులు చేసి బిల్లులు రాక పోవడంతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితులలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు మాని వారితో సమావేశం ఏర్పాటు చేసుకుని వారికి ఒక స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి : డిఇవో

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):**

పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు కష్టపడి చదవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ పాలమాకుల ప్రవీణ్ సొంత ఖర్చులతో వేయించిన బోరుమోటార్‌ను బుధవారం డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతోమంది చెప్పే వాళ్ళు ఉంటారు కానీ చేసేవాళ్లు తక్కువగా ఉంటారని, చేతలతో తన సేవా గుణాన్ని చాటుకున్న ప్రవీణ్‌కుమార్‌ను జిల్లా విద్యాశాఖ తరపున అభినందించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుమలాయ స్వామి జాతరలో ఎన్నికల కోడ్ అపహాస్యం

### సిఎం రేవంత్, సోనియా, రాహుల్‌గాంధీ బొమ్మ ఉన్న సిడిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు.... పత్తాలేని ఎన్నికల అధికారులు

**రామాయంపేట (నిజాంపేట), ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** నిజాంపేట మండలం చల్మెడ గ్రామ సమీపంలో ఉన్న శ్రీతిరుమలస్వామి బండపై జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో(జాతర) ఎన్నికల కోడ్ అపహాస్యం పాలైంది. జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు సంబంధించి ఎన్నికల నియమావళిని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని ఒకవైపు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలు ఇస్తున్నప్పటికీ కిందిస్థాయి అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఎన్నికల కోడ్ ఉల్లంఘన యదేచ్ఛగా జరుగుతుంది. వివరాల్లోకి వెళ్తే....

తిరుమలాయ బండ జాతరకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గత మంగళవారం రావడం జరిగింది. అయితే ఆయన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల వద్దకు (స్టేజీ) వచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఆయన కొన్ని విషయాలు మాట్లాడలేదు. అంతవరకు బాగానే ఉంది. అయితే నిర్వాహకులు తిరుమల స్వామి జాతర పాటలతో కూడిన ఒక సిడిని ఎమ్మెల్యే రోహిత్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆవిష్కరించిన సిడిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, స్థానిక కాంగ్రెస్ నాయకుల బొమ్మలు (ఫోటోలు) ఉన్నాయి. సిడిపై రాజకీయ నాయకుల ఫోటోలుఉన్నా అవేమి పట్టించుకోకుండా ఎమ్మెల్యే సిడిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం చిన్న రాజకీయ మీటింగ్‌ను తలపించింది. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే రోహిత్‌రావు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.





ఎన్నికల నియమావళికి విరుద్దంగా సిడినీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

ఎమ్మెల్యేతో పాటు స్టేజీపై చాలామంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులు అక్కడ కనిపించలేదు. రాజకీయ నాయకులు ఫలానా దగ్గరికి వస్తున్న విషయం ముందుగానే తెలుసుకొని, అక్కడికి అధికారులు చేరుకొని పరిస్థితులను సమీక్షించాల్సి ఉండగా, ఎన్నికల అధికారులు మాత్రం పట్టనట్లు ఉండిపోయారు.

ఎన్నికలకోడ్ ఉల్లంఘన కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రావిపల్లి అమరసేనారెడ్డి, చప్పెట ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పంజా మహేందర్, నసీరుద్దీన్, వెంకటేష్‌గౌడ్, లింగంగౌడ్, మాజీ ఎంపిపి సిద్దరాములు, దేవా లయ కమిటీ చైర్మెన్ రామ్‌రెడ్డితోపాటు పలువురు పాలకమండలి సభ్యులు, అనేకమంది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిజాంపేట తహసీల్దార్ వివరణ...**

తిరుమలాయ బండ జాతరలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన విషయంలో నిజాంపేట తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా అక్కడ జరిగింది అధికారిక కార్యక్రమం కాదని, పార్టీ మీటింగ్ కూడా కాదనీ, సిడి లాంచింగ్ చేసి అక్కడ నుంచి అటు వెళ్లిపోయారని తెలిపారు. అయితే అక్కడ మాత్రం సీడీ ఆవిష్కరణ చేసే ప్రోగ్రాం కాదన్నారు. మా నోటీసులో లేకుండా జరిగిన కార్యక్రమమని, దీంతో మాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. సిడిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటోతోపాటు పలువురి రాజకీయనాయకుల ఫోటోలుఉన్న విషయమై ఆయన దృష్టికి తీసుకురాగా, ఫోటోలు ఉండొచ్చని నేను చెప్పట్లేదన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తూంకుంట నర్సారెడ్డి

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది

### -జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంతో బుధవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను ఆమోదించడం చరిత్రాత్మకమన్నారు. అలాగే రాష్ట్రంలో కుల గణన సర్వేను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు బిసిలకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు గతంలో ఎన్నడూ చేయని విధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో బిసి, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణను ఆమోదించడం అంటే దేశ చరిత్రలోనే సాహసోపేత నిర్ణయమన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బిఆర్ఎస్, బిజెపిలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వే రాష్ట్రంలో అన్ని కులాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ స్థితిగతులను బహిర్గతం చేసిందన్నారు. అన్ని రంగాలలో వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగానే బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. ప్రతిపక్షమైన బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా కొల్లగొట్టిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నయా పైసా ఇవ్వకపోవడం, ఇక్కడ ఉన్న బిజెపి ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్ష చూపుతున్న ప్రధాని నరేంద్రమోడి పద్ధతి మార్చుకొని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. దేశంలో కుల, మత, వర్గాల పేరిట విడగొట్టి లబ్ధి పొందడమే బిజెపి నైజమని, రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు మద్దతు పలుకుతుందన్నారు. ప్రజలను ఎన్ని రకాలుగా మభ్యపెట్టినా, తప్పుదోవ పట్టించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడిన కెసిఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు సమీర్, జంగం రమేష్‌గౌడ్, ఎండి.షరీఫ్, లక్ష్మారెడ్డి, శివులు, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతి, ఎండి. షరీఫ్, గుండు లక్ష్మణ్, శ్రావణ్‌కుమార్, ఉమర్, దప్పు గణేష్ పాల్గొన్నారు.



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు

## డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా సెల్ టవర్ ఎక్కి నిరసన

**గుమ్మడిదల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొత్తపల్లి, నల్లవల్లి గ్రామ యువకులు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మహేష్ మాట్లాడుతూ వెనుకబడిన గ్రామాలు సిటీకి దూరంగా వ్యవసాయానికి దగ్గరగా పాడి పశువులు, వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న మాకు హైదరాబాద్ చెత్తను మా ప్రాంతంలో పోయడం మూలంగా జీవనోపాధితో పాటు బ్రతుకు ఆగమై పోతుందన్న భయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని అన్నారు. ఎంతో పచ్చగా ఉన్న మా పల్లెలను చెత్తతో నింపి వాయు కాలుష్యం, జల కాలుష్యం, వాతావరణ కాలుష్యంతో మాకు పుట్టబోయే బిడ్డలకు భవిష్యత్తు ఉండదని స్పష్టంగా కళ్ళకు కనబడుతుందని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకొని డంపింగ్ యార్డ్ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. లేనిఎడల భవిష్యత్తే లేని మాకు జీవనం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

### గంజాయి రహిత ప్రాంతంగా మార్చుకోవాలి : విజయ్‌భాస్కర్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** మండలాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ విజయ్ భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని కట్కూర్, అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాలలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణ గురించి నార్కటిక్స్ డాగ్స్‌తో అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కన్నపేట మండలంలో ఎవరైనా గంజాయి,మత్తు పదార్థాలు నిల్వ చేసినా అమ్మినా, తిన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరూ అమ్మినా, నిల్వ చేసిన విషయాలు ఎవరికి తెలిసినా 100 లేదా నేరుగా పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## స్థానిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలి : మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**కోహెడ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సింగారాయ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన మండల కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని అండగా నిలవాలన్నారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో పని చేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేద్దామన్నారు. ఈసందర్భంగా వింజపల్లి గ్రామానికి చెందిన గర్రెపెల్లి వీరయ్య ఇతరులు వివిధ పార్టీల నుంచి మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ బిల్లు బీసీ కుల గణన నివేదిక అసెంబ్లీలో అమోదం పొందిన సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్పుల రాజు తదితరులు సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సానాది భాస్కర్, చెరుకు రమణారెడ్డి, రమేష్, నర్సింలుగౌడ్, శ్రీకాంత్, ప్రభాకర్, మహేష్, నర్సింహులు, సురేష్, కనకరాజు, రవి, అనిల్‌గౌడ్, కిరణ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** పిఆర్‌టియు రాష్ట్ర నాయకత్వం రియల్ వ్యాపారులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టికెట్ అమ్ముకున్నారని.. ఆరేళ్లుగా ఎమ్మెల్సీగా పనిచేసి ఏ పార్టీ కండువా కప్పుకోకుండా ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశానని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది కార్పోరేట్ వ్యక్తులు ఉపాధ్యాయ వృత్తిని అగౌరవ పరుస్తున్నారని ఉపాధ్యాయుల పేరుతో కార్పోరేట్ వ్యక్తులు ఎన్నికల బరిలోకి దిగుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని తెలిపారు.తాను మరో సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలోకి దిగుతున్నానని తెలిపారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల సాధనే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. సమావేశ:లో ఎస్‌టియు నాయకుఎలు పట్నం భూపాల్, శ్రీధర్, యాదగిరి, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి : ఆర్డీవో


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రాంమూర్తి తదితరులు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** మండలంలోని పొట్లపల్లి గ్రామంలోగల శ్రీరాజరాజేశ్వర స్వామివారి దేవాలయంలో వచ్చే మహ శివరాత్రి రోజున దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి అన్నారు. బుధవారం పొట్లపల్లిలోని దేవాలయంలో జాతర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర రోజున భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలని,ప్రతీ భక్తునికి సులభంగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.అనంతరం జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసిపి సతీష్,సీఐ కొండ్ర శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, ఎంపిడివో మల్లిఖార్జున్‌రెడ్డి, ఈవో కిషన్‌రావు ఉన్నారు.

## పట్టణం పరిశుభ్రంగా ఉండాలి : మున్సిపల్ కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్యపనులు నిర్వహిస్తున్న కార్మికులకు డంప్ యార్డుకు చెత్త చేరవేసే విధానంతో పాటు తడి,పొడి చెత్తలను వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు. ప్రజలకు సైతం చెత్తను ఎక్కడ,పడితే అక్కడ వేయకుండా చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

# బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి

**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు.


2వ వార్డులో జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నేతలు

**కాంగ్రెస్ పార్టీ 2వ వార్డు అధ్యక్షుడిగా కప్ప భాస్కర్**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా కప్ప భాస్కర్‌ను నియమించారు. ఈ సందర్భంగా కప్ప భాస్కర్ మాట్లాడుతూ 2వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. వార్డు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా నియమించినందుకు పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు మల్లారెడ్డి, గోపాల్‌రావు, క్యాసారం బాబాలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావుకు రుణపడి ఉంటానని అన్నారు. 2వ వార్డులో గతంలో నేను కౌన్సిలర్‌గా పోటీచేసి ఓటమిచెందానని, మరోసారి వార్డు ప్రజలకు సేవ చేసే భాగ్య కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** తీన్మార్ మల్లన్న రెడ్డిలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు ఆవరణలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి రెడ్డి జెఏసి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి జెఏసి జిల్లా అధ్యక్షులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలుచేయడం మానుకోవాలని హెచ్చరించారు. వరంగల్ నిర్వహించిన బిసి యుద్ధభేరి బహిరంగసభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రెడ్డిలపై చేసిన వ్యాఖ్యలను జిల్లా రెడ్డి జెఏసి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గతంలో సైతంన తీన్మార్ మల్లన్న రెడ్డిలపై పలుమార్లు అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తీన్మార్ మల్లన్నను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. తీన్మార్ మల్లన్న రెడ్డిలపై చేసిన అనుచిత వ్యాఖ్యాలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తీన్మార్ మల్లన్న ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రెడ్డి జెఏసి పోరాటాలకు దిగుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్డి జెఏసి నాయకులు మారెడ్డి రాంలింగారెడ్డి, పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ముత్యాల దేవేందర్‌రెడ్డి, అర్చనరెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

-కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడి కృష్ణ

**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** త్వరలో జరగబోయే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామన్నారు. గజ్వేల్‌గడ్డపై కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం చేస్తున్న ప్రజా పాలనలో భాగంగా గడప గడపకు వెళ్లి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు అందించిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఆర్థిక భరోసా, రూ.500 గ్యాస్ లాంటి పథకాలు అందజేసిందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ దక్కదని అన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**వర్గల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, బిట్ కాయిన్స్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ మరియు సైబర్ నేరాల బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం వర్గల్ మండలం మైలారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంకు వివరాలు, ఓటిపితోపాటు వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. తెలియని నెంబర్ల నుండి ఫోన్ వచ్చినా ఎత్తవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష డప్పులు.. వేల గొంతులను జయప్రదం చేయండి

**తలకొండపల్లి ప్రభాతవార్త, ఫిబ్రవరి 5 :** ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పుల వేల గొంతుల సభను జయప్రదం చేయడం కోసం పడకల్ గ్రామంలో ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహం ముందు లక్ష డప్పుల వేల గొంతుల పోస్టర్లు ఎమ్మార్పీఎస్ అలాగే ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘల ఆధ్వర్యంలో గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రాముమాదిగ, శ్రీశైలంమాదిగ, ఎస్ఎస్‌యు నాయకులు అంబేద్కర్ మాజీ యూత్ అధ్యక్షులు చౌటి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రాంతీయ స్థాయి పోటీల్లో... ద్వితీయ స్థానంలో నవోదయ జట్టు

**వర్గల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** మహారాష్ట్రలోని నాగపూర్‌జిల్లా నావోగావు కేరిలో జనవరి 26న జరిగిన ప్రాంతీయస్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో వర్గల్ మండల పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయ జట్టు పాల్గొని ద్వితీయ స్థానాన్ని సాధించింది. ప్రథమ స్థానాన్ని గుజరాత్ రాష్ట్రంలోని వల్సాడ్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ సాధించగా ఈ ఫలితాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ బిపి.ఆచార్య బుధవారం ప్రకటించడం జరిగిందని వర్గల్ విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుజట్లు తమ ప్రదర్శనలో చక్కటి ప్రతిభను ప్రదర్శించాయని కొనియాడారు. ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని తెలిపారు. పోటీల్లో మంచి ప్రతిభను చాటిన 8 మంది వర్గల్ విద్యాలయ జట్టు విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థులు ఈ సంవత్సరంలో న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి చేతుల మీదుగా బహుమతులను అందుకోవడం జరుగుతుందన్నారు. పోటీల్లో మంచి ప్రతిభ చాటిన విద్యార్థులకు, ఎస్కా టీచర్లకు విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


బిపి.ఆచార్య చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న దృశ్యం


సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

## సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

**బెజ్జంకి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమలుచేసిన సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అమలుకు సహకరించిన మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకటి రాములు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిఎం, ఎమ్మెల్యే సత్యనారాయణ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. 30 ఏళ్లుగా మాదిగ, మాదిగ ఉప కులాలు ఎదురు చూస్తున్న కల నెరవేరిందన్నారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మచ్చ కుమార్, లింగాల శ్రీనివాస్, జనగాం శంకర్, కర్రావుల సందీప్, కర్రవుల శంకర్, జేరిపోతుల మధు, ఐలయ్య, కనగండ్ల రాజయ్య, బోనగిరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రేయోభిలాషి ట్రస్టు సేవలు అభినందనీయం : డిఇవో

**ములుగు, ఫిబ్రవరి 5 ప్రభాతవాఆర్త :** శ్రేయోభిలాషి సేవా ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని విపిజె ఫంక్షన్‌హాల్ లో శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వర్గల్, ములుగు, మర్కుక్ మండలాలకు చెందిన 1200మంది 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విజన్-1 ద్వారా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో భయాందోళనలు పోగొట్టే విధంగా మోటివేషన్ చేయడం గొప్ప విషయమన్నారు. రేపటి పౌరులను తీర్చిదిద్దడంలో శ్రేయోభిలాషి సేవా ట్రస్టు చేస్తున్న కృషి అమోఘమన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణుజగతి మాట్లాడుతూ ట్రస్టులో మొత్తం 7 విజన్లను రూపొందించడం జరిగిందని, అందులో భాగంగా మొదటి విజన్‌గా ఫిబ్రవరి మాసంలో పదో తరగతి విద్యార్థులను మోటివేషన్ చేయడం అని తెలిపారు. నేషనల్ అవార్డు విన్నర్,రిటైర్డ్ ఎంఈఓ వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో మూడు మండలాలలోని ఆయా గ్రామాల పాఠశాలల ఎంఈఓల సహకారంతో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని విష్ణు జగతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి పోరెడ్డి మల్లేశం, కోశాధికారి గంప ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి మొగిలి రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు ఆకుల సుధాకర్, సిహెచ్.రమేష్, ముత్తినేని పురుషోత్తం, సాయిని మహేష్, అంబి, రాంబాబు, డాక్టర్ పురుషోత్తం, మధుసూదన్‌రెడ్డి, ఎర్ర పురుషోత్తం, ఎస్.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే : సిఐ మహేందర్‌రెడ్డి

**ములుగు, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన ములుగులోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మీ కోసం మీ తల్లి దండ్రులు పడుతున్న కష్టాన్ని, శ్రమను గుర్తించాలన్నారు. సెల్‌ఫోన్‌లకు కాకుండా చదువుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని, చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు గజ్వేల్ షీ టీం ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుల్ లావణ్య, ములుగు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్చన కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

**మేడ్చల్, ఫిబ్రవరి 5. ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డులోని కిష్టాపూర్ పరిధిలో గల అర్చన కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పూర్తిస్థాయిలో అం డర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు పడు తున్నారని వినతిలో పేర్కొ న్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అర్చన సేవ సమితి అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుచ్చి రాములు, కోశాధికారి మన్మధరావు, కార్యవర్గ సభ్యుడు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు

**మేడ్చల్, ఫిబ్రవరి 5. ప్రభాతవార్త**

బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన బుద్ధి శ్రీనివాస్‌కు మేడ్చల్ బిజెపి నాయకులు శుభా కాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో పలు వురు నాయకులు ఆయనను సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అదిరోహించాలని ఈ సందర్భంగా పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజా హరినాథ్, మేడ్చల్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, జగన్ గౌడ్, నాయకులు శ్రీకాంత్, ప్రేం దాస్, సర్వేశ్వర్‌రెడ్డి, రాజు, అర్జున్, వంశీదర్‌రెడ్డి, వంశీ, దశరథ, పుష్ప రెడ్డి, అనిత, మహేష్, అభిలాష్‌రెడ్డి, బాబు దాస్, నర్సింగ్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న బిఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

**నంగునూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** యాదేచ్ఛగా బిఆర్ఎస్ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. బుధవారం ఎమ్మెల్సీ మండల ఎన్నికల అధికారి ఎంపిడిఓ లక్ష్మప్పకు మండల పరిషత్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 6 రోజులు గడిచిపోతున్న బిఆర్ఎస్ నాయకులు యాదేచ్ఛగా పార్టీ జెండాల ఆవిష్కరణ పేరుతో మండలంలోని పలు గ్రామాలలో పార్టీ కండువాలతో ర్యాలీగా తిరుగుతూ పార్టీ జెండాలు ఆవిష్కరణ చేస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న బిఆర్ఎస్ నాయకులపైన వారిని ప్రోత్సహిస్తున్న హరీష్‌రావుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు చెలికాని యాదగిరి, జంగిటి శ్రీనివాస్, బాగు శ్రీకాంత్ యాదవ్, గౌరబోయిన సంపత్, అవుల నాగరాజు,విక్రమ్‌రెడ్డి, మ్యాకసాగర్, సమ్మిబాబు, గడ్డం శివ, నీల రమేష్ పాల్గొన్నారు.


ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం


సిఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

## ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందేలా చూడాలని.. పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించినట్లు టిపిసిసి సభ్యుడు దరిపల్లి చంద్రం, పట్టణ అధ్యక్షుడు ఎండి. ఇమామ్(అత్తు) తెలిపారు. హైదారాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలవగా ఆప్యాయంగా పలకరించి మాట్లాడినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపినట్లు తెలిపారు. బీసీ కులగణన చేసి తీరమని అలాగే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని చెప్పినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణుల గెలుపుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కైవసం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం చంద్రం కూతురు వివాహం సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి పత్రిక అందించి ఆహ్వానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాకి అనంద్, రియాజుద్దీన్, గయాజుద్దీన్, అనిల్‌కుమార్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కొమురవెల్లి, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త :** మండల పరిధిలోని గురువన్నపేట గ్రామానికి చెందిన వరగంటి సత్తెమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి బుధవారం పేదకుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మకిలి కనకయ్య, బుడిగే రమేష్‌గౌడ్, మకిల్ నవీన్, బుడిగే రమేష్, పచ్చిమడ్ల స్వామి అలకుంట బాలమల్లు, మకిలి ఈశ్వర్‌సాయి, పవన్, మహేష్ పాల్గొన్నారు.

## బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా...!?

భారత ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా అడుగుతున్న సర్పంచ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడాన్ని భారత ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి, కపూర్‌నాయక్‌తండా మాజీ సర్పంచ్ బానోతు సంతోష్ ఖండించారు. బుధవారం పెండింగ్‌బిల్లుల గురించి ప్రశ్నించేందుకు మాజీ సర్పంచ్‌లు చలో అసెంబ్లీకి సన్నద్ధమౌతున్నారని తెలుసుకున్న ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. 2019వ సంవత్సరంలో సర్పంచ్‌లుగా గెలిసిన సర్పంచ్‌లు అందరూ గ్రామాల అభివృద్ధికి అప్పులు చేసి ఇప్పుడు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వంలా వ్యవహరించకుండా సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు చేస్తున్న ఆందోళనలకు భరత ప్రగతిశీల యువజన సంఘం పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

## రామరాజు పంతులు సేవలు చిరస్మరణీయం


రామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ నాయకులు దివంగత చాడ రామరాజు పంతులు సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సారెడ్డి నివాసంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఆధ్వర్యంలో చాడ రామరాజు పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ పార్టీ ప్రచార కార్యదర్శిగా రామరాజు గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తూంకుంట ఆంక్షరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, సుభాష్‌చంద్రబోస్, షరీఫ్, సమీర్, నంగునూరి సత్యనారాయణ, గంగిశెట్టి రాజు, గాడిపల్లి శ్రీనివాస్, రాంచంద్రాచారి, జగ్గయ్యగారి శేఖర్, జంగం రమేష్‌గౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్ల అంజాగౌడ్ అనారోగ్యానికి గురికాగా బుధవారం ఆయనను నేషనల్ కాంగ్రెస్ వారియర్స్ జిల్లా అధ్యక్షులు గజభీంకర్ అశోక్, దుబ్బాక నియోజకవర్గ సీనియర్ నాయకులు గాడిపల్లి రఘువర్దన్‌రెడ్డిలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట నాయకులు రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణబాబుగౌడ్ తదితరులు ఉన్నారు.

## తీన్మార్ మల్లన్నపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**మర్కుక్, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):** రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు రాజన్నగారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి చేతనైతే మళ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నర్సన్నపేట తాజా మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మర్కుక్ లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సాకేత్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, ఎంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**నంగునూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం చట్ట బద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అనగోని లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని లేని పక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికాక తప్పదన్నారు. సమావేశంలో నాయకులు గుండు భూపేష్, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎద్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య కూతురు రాజిరెడ్డి, చెలికాని మల్లేశం, పద్మ, బిక్షపతినాయక్, రాము, రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

## ఎంప్లాయిస్ యూనియన్ నిరసన



ఎల్ఐసి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
బిహెచ్ఈఎల్ ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గీత స్వామి నాథన్ మాట్లాడుతూ బీమారంగంలో విదేశీ పెట్టుబడి 74శాతం నుంచి 100శాతానికి బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్సులు జారీచేయడం, బీమాకంపెనీల ఏర్పాటుకు నిర్ధారిత మూలధనాన్ని క్యాపిటల్ తగ్గించడం ఏజెంట్లకు ఒకటికంటే ఎక్కువ బీమాకంపెనీల పాలసీలు అమ్మడానికి అనుమ తించడం వలన విదేశీ పెట్టుబడిదారులకు మన దేశీయపొదుపు మీద పూర్తి నియంత్రణకు వీలు కల్పిస్తుందని, విదేశీ పెట్టుబడులు అధిక లాభార్జన కోసమే మార్కెట్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. బీమాకంపెనీ నిధుల మళ్లింపు కనీసం చెల్లింపులో ఆస్వస్థత, వినియోగదారుల ప్రయోజనాలపై రాజీపడటం, పాలసీదారుల డేటా గోప్యతకు రక్షణ లేకుండాపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు తిరుమలాదేవి, ఉమా సుబ్రహ్మణ్యం, బీమా ఉద్యోగులు పాల్గొన్నారు.

## కిషన్‌రావుకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



న్యాయవాది కిషన్‌రావుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఏస్గి గ్రామానికిచెందిన న్యాయవాది కిషన్‌రావు రోడ్డు ప్రమాదానికి గురై హైద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ కాన రాని లోకాలకు చేరిపోయారు. కిషన్‌రావు మృతిచెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడిజిల్లా ప్రణాళికాసంఘం మాజీసభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్‌లు ఏస్గి గ్రామానికి చేరుకుని కిషన్‌రావు భౌతికదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటివీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు ముంతాజ్, మాజీసర్పంచ్ గుండేరావుపాటిల్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మనీష్‌పాటిల్, సొసైటీ వైస్‌చైర్మన్ అంజి రెడ్డి, నాయకులు బి.రాజు, రహీమ్, పండరి, ప్రకాష్‌పాటిల్, బాబు పాల్గొన్నారు.

## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
సంగారెడ్డిజిల్లా బిసిహక్కుల సాధనసమితి ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఏఓఎం పరమేశంకు బిసిహక్కుల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ పాముల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టినసర్వేలో అవకతవకలు జరిగా యని మరల సర్వేజరిపి నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి కులగణన జరపాలని, కేంద్రక్యాబినెట్లో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో బిసిజనాభా ప్రాతిపదికన స్థానికసంస్థలలో రిజర్వే షన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మామిళ్ళ ఆనంద్ వడ్ల, శశిధర్, విట్టల్‌యాదవ్ రెహమాన్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం



ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5, ప్రభావార్త:**
చిన్నశంకరంపేట పట్టణంలో బుధవారం ముదిరాజ్‌సంఘం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ ముదిరాజ్‌సంఘం నూతన అధ్యక్షునిగా ఎల్లబోయిన బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నిదబో యిన స్వామి, ప్రధాన కార్యదర్శి మేడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా పుట్నాల నవీన్, దదువాయి సురేష్, కోషాధికారిగా గంట యాదగిరి, బాపని వెంకటేశంలను ఎన్నుకున్నట్లు ఆసంఘం సభ్యులు తెలిపారు.

## ఇందిరమ్మ నమూనా ఇంటినిర్మాణానికి స్థలసేకరణ



ఇందిరమ్మ నమూనా ఇంటినిర్మాణానికి స్థలసేకరణ చేస్తున్న దృశ్యం

**టేక్మాల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న ఇంది రమ్మ నమూనా ఇంటినిర్మాణానికి అధికారులు బుధవారం స్థలపరిశీలన చేశారు. టేక్మాల్ మండలకేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణంలో నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకుగాను మోడల్ హౌస్ నిర్మాణం చేపడుతున్నట్లు హౌసింగ్ డిఈ యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడివో విఠల్, హౌసింగ్ ఇన్స్‌పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# డంప్ యార్డు ఆపాలని బిఆర్ఎస్ నిరసన

**-ఎమ్మెల్యే, నేతలను అరెస్టు చేసిన పోలీసులు**



డంప్‌యార్డు పనులు ఆపేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి నిరసన వ్యక్తంచేస్తున్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండల పరిధిలోని ప్యారానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డంపుయార్డు నిర్మాణ పనులను ఆపేయాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డితో కలిసి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి బిఆర్ఎస్ నాయ కులతో కలిసి ప్యారానగర్ వెళ్తుండగా నల్వల్లి వద్ద పోలీసులు ఎమ్మెల్యే, నాయకులను అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బిఆర్ఎస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ప్యారానగర్‌లో డంప్‌యార్డు పనుల ను వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. డంప్ యార్డుతో గాల్లోకి విషం చిమ్ముతోందని, ప్రజలు శ్వాస పీల్చుకునేందుకు పాట్లు పడుతున్నారని, భూగర్భజలాలు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డంప్‌యార్డు పనులను ఆపేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆదర్శ్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో జిన్నారం మండల మాజీ జడ్పిటిసి సభ్యులు బాల్‌రెడ్డి, రామ చంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నర్సాపూర్, పటాన్‌చెరునియోజకవర్గాల బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అద్భుత శిల్పకళాసంపదకు నిలయం తుంబురుని దేవాలయం

**-వేయేళ్ల చరిత్రకు తార్కాణం..**
**-ప్రాచీన కళలకు నిలయమైన వెల్పుగొండ ఆలయం..**



తుంబురీశ్వరుని దేవాలయం (ఇన్‌సెట్ ఆలయంలో శివలింగం)

**టేక్మాల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లాలోని టేక్మాల్ మండలపరిధిలోని వెల్పుగొండగ్రామంలో అద్భుత శిల్పకళాసంపదకు తార్కాణం శ్రీతుంబురీశ్వరుని ఆలయం. ఆలయ ఆవరణ లో ప్రతి శిల ఓంకారమే.. ప్రతి రాయి ఓ విగ్రహాకారం సంతరించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. మారుమూల ప్రాంతంలో ఉన్న పల్లెసీమ ఇది.. వింత గణేశుడు, బుద్ధుడు, నాగబంధాలు, గ్రామదేవతల విగ్రహాలు గ్రామశివారులో గల కొండపై రామాలయం.. ఇలా ఎన్నో దేవతావిగ్రహాలు కొలువుదీరాయి, గ్రామ ప్రవేశమార్గంలో తొలిదశలో చెక్కిన విఘ్నేశ్వరుడివిగ్రహం దర్శమి స్తు ఏది. అది ఒక పెద్దశిలపై చెక్కి ఉంది. పంచాయతీ కార్యాలయం వద్ద నిశితంగా గమనిస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఓ విధమైన శబ్దంచేసే నల్లరాయి తలభాగం వరకు ఉన్న బుద్ధుడిని అక్కడ చూడవచ్చు. ఉత్తరభారతదేశంలో కనిపించే ఇలాంటి విగ్రహాలు.. ఇక్కడ కనిపించడం ఆశ్చర్యమే. ఉంగరాల జుట్టు అనేది భారతీయుల విగ్రహాలపై గ్రీకువీరుల స్వభావాన్ని స్పష్టంగా చూపుతోంది. ప్రపంచంలో విగ్రహాలను చెక్కింది గ్రీకులే. వర్ధమాన మహా వీరుడిని ఇక్కడ గుట్టలపై భాగాన తొలిచారు. అతనికి రక్షణగా మహిళారక్షక భటులను కింద చెక్కారు. ఉత్తర మహాభారతదేశంలో మౌర్యుల కాలంలో చక్రవర్తులకు రక్షణగా మహిళా అంగరక్షకులు ఉండేవారట. వారిచేతుల్లో ఆయు ధాలు వీరత్వాలను చూపుతున్నాయి. ఆదిమానవుడి ఆనవాలు మన తెలం గాణలో అనేక ప్రదేశాల్లో దొరికాయి. అప్పటి ఆదిమానవుడు వేటలో జంతువుల బొమ్మలు, తొలి ఆయుధమైన బాణం, గుర్రాలులాంటివి వెల్పుగొండ గుట్టలపై, ఎర్రరంగులో చెక్కబడ్డాయి. బ్రహ్మదేవుడు పేర్చిన గుట్టగా ప్రసిద్ధి. రాతి వరుసలకింద అనేకగుహలు ఉండడం విశేషం, అప్పట్లో జరిగిన మతసంక్షోభం వల్ల గ్రామంలో అక్కడక్కడ విరిగిపోయిన శివలింగాలు కనబడుతున్నాయి. అప్పటి మత కల్లోలాలతోనే ఈవిగ్రహాలను ధ్వంసం చేశారనే చెపొచ్చు. మూడెకరాల విశాలమైన ఖాళీస్థలం, గుట్టపై రామాలయం ఉంది. అక్కడకు చేరుకోవడానికి రాతిమెట్లు ఉన్నాయి. ఈ మధ్యనే గుట్టపైకి వాహనాలు వెళ్ళేందుకుగాను రహదారిని ఏర్పాటు చేశారు. పక్కనే ఆంజనేయుని విగ్రహం చెక్కగా దానిని రామాలయం వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. రామాలయం నుంచి చూస్తే మెదక్‌ఖిల్లా, చర్చ్‌శిఖరం దర్శన మిస్తుంది. ఈరాతిగుట్టపై ఓనీటిగుండం ఉంది. ఇందులో ఎప్పటికీ నీళ్ళు పుష్కలంగా ఉంటాయి. ఈనీటితో రామునికి జలాభిషేకం జరుగుతుంది. వెల్పుగొండ చెరువు 300 ఎకరాల్లో ఉంది. దాని చుట్టు కొండలున్నాయి. చెరువుమధ్యలో పెద్దరాతిగుట్ట ఉంది. దీనిని దేవతల గుట్టగా పిలుస్తారు. గుట్టలోపల పెద్ద గుహలున్నాయి. అందులో శీతాఫలాల చెట్లు..పూల మొక్కలున్నాయి. గుట్టపై భాగాన దిగంబర బాహుబలి విగ్రహం నిటారుగా వెల్పుగొండకు రక్షణగా నిలబడి ఉన్నదా.. అనిపిస్తుంటుంది. స్థానికులు ఈవిగ్రహాన్ని భైరవుడు అని పిలుస్తారు.

**స్వయంభూ తుంబురేశ్వరుడు..**
వెల్పుగొండలోని స్వయంభూ శివలింగ దేవాలయం ఉంది. ఇక్కడ శివుడిని నారద తుంబురేశ్వరుడిగా చెబుతున్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయం ఇది. వేయి స్తంభాలగుడి, రామప్పదేవాలయాన్ని పోలిన ప్రాచీన దేవాలయం ఇది. సాధారణంగా ఏగుడినిచూసినా రామాయణ, మహాభారత శిల్పాలుంటాయి. ఈదేవాలయంపై మహిళామూర్తుల విగ్రహాలు, మహిషాసుర మర్ధిని, నాగిని, గ్రీకువీరుడు, అద్దంలో తనప్రతిబింబం చూసుకుంటున్న నెర జాణలాంటిశిల్పాలు ఎంతో అందంగాచెక్కబడ్డాయి. ఆలయానికి మూడు ద్వారాలున్నాయి. ఈశిల్పకళను చూసినవారు ఆశ్చర్యపోకతప్పదు.

## విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఒ బచ్చలి సత్తయ్య

**కొండపాక, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని కుకునూరుపల్లి ఎంఈఒ బచ్చలి సత్తయ్య సూచించారు. బుధవారం కుకునూ రుపల్లి మండలపరిధిలోని లకుడారం ప్రాథమికపాఠశాలను అయన సందర్శిం చారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కొత్త కొత్త పద్ధతుల్లో విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థుల్లో మేధోసామర్థ్యం పెంచడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. విద్యార్థులు పాఠాలు చదవడం, రాయడంతోపాటు గణితంలో వారిపరిజ్ఞానాన్ని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం రికార్డులను, మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో పోషకాహారలోపాన్ని నివారించడానికి ప్రభుత్వం విద్యార్థులకు కోడిగుడ్లను అందించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నభోజనం పట్ల అయన సంతృప్తి వ్యక్తంచేశారు.

## స్వచ్ఛంధ సంస్థ సహకారంతో విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5, ప్రభావార్త:**
మండలపరిధి ఖాజాపూర్‌తాండ ప్రభుత్వపాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లోని మాజీ ఎంపిటిసి లాల్యానాయక్ విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి తారాచంద్, ఉపాధ్యాయులు ప్రవలిక, శ్రీకాంత్, స్రవంతి, గ్రామస్థులు శంకర్, రమేష్, లక్ష్మణ్, రెడ్డినాయక్, అంగన్‌వాడి టీచర్ రాణి, గోపాల్‌నాయక్, లక్ష్మణ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి కార్పొరేటర్ పాలాభిషేకం



సిఎం, పిసిసి అధ్యక్షుల ఫ్లెక్సీకి పాలాభిషేకంచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేకు శాసన సభలో ఆమోదించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సహకరించిన టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌లను అభినందిస్తూ బుధవారం శ్రీనివాస్‌నగర్ కాలనీ సండేమార్కెట్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో సిఎం, టిపిసిసి అధ్యక్షులు ఫ్లెక్సీకి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పార్టీనాయకు లతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ, బిసిలకు 42శాతం రిజర్వేషన్‌కొరకు ఆమోదించడం శుభపరిణా మమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్సాశ్యామ్, సి.ప్రభాకర్, అరుణ్, ఓబిసి అధ్యక్షులు మావీన్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు ఈశ్వర్‌కపూర్,, హబీబ్, మైనార్టీ అధ్యక్షులు హబీబ్ జానీ, కావలి నగేష్, పీటర్, శాంతమ్మ, ఐలేష్ ఐలాపూర్, శ్రీకాంత్‌నాయక్, ఆనంద్‌గౌడ్, సంతప్‌గౌడ్, రఫీ, శ్రీనివాస్, రమేష్, శేఖర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎఎస్ఐ

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
పట్టణశివారులోని మంగల్‌పేట్‌లో బుధవారం సాయంత్రం అటుగా వెళు తున్న వాహనాలను ఎఎస్ఐ మొగులయ్య తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వాహనచోదకులు విధిగా వాహనాల ధృవపత్రాలను అందుబాటులో పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనాల డ్రైవర్లు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు చోదకులు సీటు బెల్టును పెట్టుకోవాలని సూచించారు.

# ఏసు బోధనలు ప్రేమతత్వానికి ప్రతీకలు

**-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్**



మిన్పూర్ చర్చి వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

**పాపన్నపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
ఏసుక్రీస్తు బోధనలు ప్రేమతత్వానికి ప్రతీకలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిన్పూర్ చర్చి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై చర్చిలో ప్రత్యేకప్రార్ధనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ ప్రసిద్ధిచెందిన మెదక్ చర్చి అభివృద్ధికి 30లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. మిన్పూర్ చర్చి అభివృద్ధికి సైతం తనవంతు కృషిచేస్తామన్నారు. ఏడుపాయల ఆలయానికి డబుల్ రోడ్డు నిర్మాణానికి 35లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. మెదక్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందచేయాలన్నారు. కార్యక్రమంలో రెవెండ్ ర్యాటెన్ మార్క్, ప్రిసిల్లా వరిమల రూబెన్, విన్సన్, జయానంద్ సాలమన్ రాజ్, విమల్‌కుమార్, ప్రభుకిరణ్, విల్సన్, జార్జ్ ఎబెనెజర్‌రాజా, అనిల్‌కుమార్, డా.దయానంద్, కాంగ్రెస్‌నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌చౌదరి, క్రీస్తుదాస్, రత్నయ్య, బాబర్‌పటేల్, నాగరాజు, విజయకుమార్, దావీద్, ఆంద్రయ్య, ప్రశాంత్, ఆకుల శ్రీను, శ్రీకాంతప్ప, పార్శి నర్సింలు, ఇంద్ర సేనారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, ఖాజా, మోహన్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
మండలపరిధిలోని యూసుఫ్‌పేటగ్రామంలో ఇటీవల బైండ్ల సత్తయ్య, శ్రీనివాస్‌ల పూరిగుడిసెలు అగ్ని ప్రమాదంలో కాలిపోయినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్ ఆగ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

## తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంక్షేమసంఘ సభ్యులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
రెడ్డికుల సంఘం సభ్యులపై అనుచితవ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న ఎలియాస్ చింతపండు నవీన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రామాయంపేట రెడ్డి సంక్షేమసంఘం డిమాండ్ చేసింది. బుధవారం సంఘం సభ్యులు మల్లన్నపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి కులాల మధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుకుంటున్న మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఒకసారి జైలుశిక్ష పాలైనా తన వైఖరి మార్చుకోని తీన్మార్ మల్లన్న, మరింతగా రెచ్చిపోతూ పెద్ద ఎత్తున దందాలకు, అవినీతి కార్యక్రమాలకు తెరలేపారని వారు ఆరోపించారు. కేంద్రప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఓసిలకు కల్పించిన రిజర్వేషన్లను అపహాస్యం పాలుచేస్తున్న మల్లన్న అవినీతికర చేష్టలతో కోట్లు గడించా డని వారు ఆరోపించారు. ఇకనైనా తీన్మార్ మల్లన్న రెడ్డి కులస్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిచో బయట తిరగనివ్వమని సంఘం సభ్యులు హెచ్చరించారు.

## బిజెపి జిల్లా నూతన అధ్యక్షుడిని కలిసిన మండల నాయకులు



నూతనాధ్యక్షుడికి మిఠాయి తినిపిస్తున్న రామాయంపేట మండలనాయకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌ను రామాయంపేట మండల బిజెపి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్‌లోని మల్లేష్‌గౌడ్ స్వగృహంలో ఆయనను కలిసిన నాయకులు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సారథ్యంలో జిల్లాలో బిజెపి పార్టీని బలోపేతం చేసేందుకు తోడ్పాటునందిస్తామని వారు పేర్కొ న్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రామాయంపేట మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, సీనియర్ నాయకుడు జంగపల్లి శంకర్‌గౌడ్, బండారి ఎల్లంగౌడ్, కటికె కార్తిక్, వొలిసె సతీష్‌రావు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
ఈనెల 15న జరగనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని గిరిజనసంక్షేమ సంఘం నాయకులు సర్దార్‌నాయక్, వినోద్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా గిరిజనులు స్వామివారికి విశేషపూజలు నిర్వహిస్తారని, ఆరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవుదినంగా ప్రకటించాలని కోరారు.

## బకాయి వేతనాలు అందించాలి

**-ఏఐటిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్‌రాజ్యం**



బకాయి వేతనాలు అందించాలని వినతిపత్రం అందచేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి బకాయిపడ్డ 4నెలల వేతనాలను వెంటనే అందించాలని డిమాండ్‌చేస్తూ ఏఐటిసి ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ రమేష్‌కు బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్‌రాజ్యం మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, పేషంట్‌కేర్ సిబ్బందికి 4నెలల వేతనాలు చెల్లించకపోవ డంతో కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతు న్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని, లేకుంటే నిరసనకార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లానాయకులు చిరంజీవి, ఆనంద్, భాగయ్య, అశోక్, కార్మికులు భారతి, ఎలీషా, సుజాత, లక్ష్మి, యశోద, కవిత, పారమ్మ, రాములు, బాలమ్మ, విఠల్ పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా అన్ని విద్యాసంస్థల బంద్



స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్న పాఠశాల విద్యార్థులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:**
నల్లవల్లి ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా బుధవారం మండలకేంద్రమైన గుమ్మడిదలతోపాటు అన్నిగ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్వచ్ఛందం గా బంద్ పాటించారు. విద్యార్థులు నిరసన తెలుపుతూ పాఠశాలను వదిలి వెళ్ళిపోయారు. భవిష్యత్తులో జీవనమే కనుమరుగయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.